నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

దోడంద చేరుకున్న మెస్రం వంశీయులు

- నాలుగు రోజుల పాటు అక్కడే బస

ఇంద్రవెల్లి: ఈ నెల 10న కేస్లాపూర్‌లోని మురాడి దేవస్థానం నుంచి బయలుదేరిన మెస్రం వంశీయులు గంగాజలంతో తిరుగు ప్రయాణంలో మండలంలోని దోడందకు చేరుకున్నారు. 17న మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గోదావరి హస్తినమడుగు నుంచి తిరుగు పయనమయ్యారు. దోడంద గ్రామ పొలిమేరలో చెట్టుకు గంగాజల కలశాన్ని భద్రపరిచారు. అక్కడ 23వరకు బస చేస్తారు. తిరిగి 24న మండల కేంద్రంలోని ఇంద్రాదేవి వద్దకు చేరుకుంటారు. ఇంద్రాదేవి వద్ద గంగాజలంకు వెళ్లిన మెస్రం వంశీయుల కుటుంబాలు ఎడ్ల బండ్ల ద్వారా దేవి ఆలయం వరకు చేరుకుంటారు.



బాధిత రైతు కుటుంబానికి కలెక్టర్ పరామర్శ

నవతెలంగాణ-బేల

ఇటీవల ఐసీఐసీ బ్యాంకులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవరావ్ కుటుంబాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పరామర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రైతు కుటుంబాన్ని పరామర్శించి, రైతు ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కలెక్టర్ వెంట డీఎస్పీ జీవన్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.



గ్రామసభలోనే ఫైనల్..!

- నేటి నుంచి నాలుగు రోజులు నిర్వహణ
- పంచాయతీల వారీగా షెడ్యూల్ రూపకల్పన
- జాబితాల్లో పేర్లపై లబ్దిదారుల్లో ఉత్కంఠ
- గ్రామస్తుల సమక్షంలోనే అర్హుల ఎంపిక
- 26 నుంచి నాలుగు పథకాలు ప్రారంభం

ఆరు గ్యారెంటీ పథకాలు పొందే లబ్దిదారుల ఎంపిక గ్రామసభలోనే ఫైనల్ కానుంది. ప్రజాపాలన సభలతో పాటు కుల గణన సర్వే ప్రకారం ప్రస్తుతం అర్హుల జాబితాలు రూపొందించిన అధికారులు వాటిని గ్రామసభల్లో పెట్టనున్నారు. వీటిని ప్రజల సమక్షంలో ఉంచి వారి నుంచి అనుమతి తీసుకోనున్నారు. గ్రామస్తులు అనుమతించిన వాటినే ఫైనల్ జాబితాగా రూపొందించి పథకాలను అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఈ సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే గ్రామాల వారీగా సభలు నిర్వహించే షెడ్యూల్‌ను అధికారులు ప్రకటించారు. ఇందులో సభలు నిర్వహించే అధికారుల పేర్లు..ఫోన్ నెంబర్లు తదితర వాటిని పొందుపర్చారు. ఈ సభల్లో ఎంపిక చేసిన లబ్దిదారులకు ఈ నెల 26న నాలుగు పథకాలను వర్తింపజేయనున్నారు. మరోపక్క ఇప్పటికే అర్హుల జాబితాలు అధికారుల వద్ద ఉండటంతో వాటిలో ఎవరి పేర్లు ఉన్నాయి..ఎవరిని పరిగణనలోకి తీసుకుంటారోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.



ఇచ్చోడ మండలంలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్నింటిని అమలు చేస్తుండగా..కీలకమైన మరో నాలుగు పథకాలను గణతంత్ర దినోత్సవం రోజు నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. అనేక ఏండ్ల నుంచి గూడు కోసం ఎదురుచూస్తున్న నిరుపేదల ఆశలు ఫలింపజేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్న అధికారులు వాటి పరిశీలన చేపట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అర్హులైన లబ్దిదారులను గుర్తించారు. జాబితా కూడా రూపొందించారు. వీటిని తాజాగా నిర్వహించనున్న గ్రామసభల్లో ప్రజల నుంచి ఆమోదం తీసుకుంటారు. ఈ సభల్లో ఆమోదం లభించిన లబ్దిదారులకు ఈ నెల 26న ఇండ్ల మంజూరుపత్రాలను అందించడంతో పాటు ఇంటి నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నారు. మరో కీలక పథకమైన రైతుభరోసా కోసం అన్నదాతలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసిందని...సాగుకు పనికి రాని భూములకు కూడా సాయం అందించిందనే కారణంగా ఈ పథకం ఏడాది నుంచి నిలిచిపోయింది. గత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం అందించలేదు. తాజాగా ప్రభుత్వం సాగుకు యోగ్యంగా లేని భూములను గుర్తించి జాబితా నుంచి వాటిని తొలగించనుంది. ఈ భూముల వివరాలను సైతం గ్రామసభల్లో ఉంచి ఆమోదం తీసుకోనున్నారు. అనంతరం సాగు భూమి కలిగిన రైతులందరికీ రైతుభరోసా కింద ఏడాదికి రూ.12వేల చొప్పున రెండు విడతల్లో పెట్టుబడి సాయం అందించనుంది. వీటితో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కూలీలకు రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించిన లబ్దిదారుల జాబితా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులకు చేరింది. ఈ జాబితాను గ్రామ సభల్లో పెట్టి ఆమోదం తీసుకోనున్నారు. దీంతో తొలి విడత కింద ఈ పథకం పొందేదెవరోనని లబ్దిదారుల్లో ఉత్కంఠకు దారితీస్తోంది.

రేషన్‌కార్డులకు లబ్దిదారుల గుర్తింపు..!

ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే అధికారులు ఇటీవల గ్రామాల్లో చేపట్టిన కుల గణన సర్వే ఆధారంగా కార్డు లేని వారిని గుర్తించి జాబితాలో చేర్చారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో 18,741మంది, నిర్మల్ జిల్లాలో 17,491మంది, మంచిర్యాల జిల్లాలో 18,788మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 17,044మంది పేర్లలో జాబితా రూపొందించింది. కానీ ఈ జాబితాలో ఇంకా అనేక మంది అర్హుల పేర్లు రాకపోవడంతో గందరగోళానికి దారితీసింది. లబ్దిదారుల ఎంపికపై అర్హుల్లో అసంతృప్తి వ్యక్తం కాగా ఉన్నతాధికారులు స్పందించారు. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా ఉంటుందని..గ్రామసభల్లోనూ దరఖాస్తులు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

గ్రామాల వారీగా షెడ్యూల్..!

జిల్లాలో చేపట్టాల్సిన గ్రామ సభల షెడ్యూల్‌ను అధికారులు ఇప్పటికే ప్రకటించారు. మండలాల వారీగా రూపొందించిన ఈ షెడ్యూల్ ప్రకారం ఒక్కో రోజు సుమారు 5 నుంచి 6గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. ఈ నెల 24వ వరకు నిర్వహించాల్సి ఉండటంతో నాలుగు రోజుల్లో జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామసభలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సభల నిర్వహణకు అవసరమైన అధికారులను నియమించారు. మరోపక్క ఈ సభల్లో జాబితాలో ఎవరి పేరు ఉంటుందోననే లబ్దిదారుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పట్టణాల్లోనూ వార్డుల వారీగా సభలు నిర్వహించనున్నారు. పల్లెవాసులు అయి ఉండి పట్టణాల్లో నివాసముంటున్న వారు ఈ సభలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామస్తులందరి సమక్షంలోనే లబ్దిదారుల ఎంపిక చేపట్టి పారదర్శకతకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ సరఫరాపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్క మిల్లరు సిఎంఆర్ సరఫరాలో వేగం పెంచాలని ఆదేశించారు. సీఎంఆర్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యం, పూర్తిచేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం, రోజు వారీగా తరలిస్తున్న ధాన్యం లారీల వివరాలను మిల్లర్ల వారీగా సమీక్షించారు. రెవెన్యూ సివిల్ సప్లయ్ అధికారులు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లులో ధాన్యం నిల్వ, సామర్థ్యం, మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం, అన్‌లోడింగ్ ఇతర అంశాలను పరిశీలించి రోజూవారి నివేదికలను అందజేయాలని తెలిపారు. సమావేశంలో డిఎస్‌ఓ కిరణ్ కుమార్, డీఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

బొమ్మల కొలువు సాంప్రదాయంగా ఆచరించాలి



నవతెలంగాణ-జైపూర్

పూర్వీకుల నుండి సాంప్రదాయంగా వస్తున్న బొమ్మల కొలువును జరుపుకోవాలని సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు అన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం బొమ్మల కొలువు ఘనంగా నిర్వహించారు. దీనికి డైరెక్టర్ సత్యనారాయణరావు సతీమణి హరిణి, డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడి రాజశేఖర్‌రావు సతీమణి వెంకటలక్ష్మి, జిఎం(పిసిఎస్) కె.శ్రీనివాసులు సతీమణి సుమిథ, లేడీస్ క్లబ్ సెక్రెటరి స్రవంతి, లేడీస్ క్లబ్ మహిళలు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల సంప్రదాయంగా నిర్వహించే ఈ బొమ్మల కొలువు వేడుకలు ఇప్పటికీ ఏమాత్రమూ వన్నె తగ్గకుండా మహిళలందరూ ఉత్సాహంగా నిర్వహించుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలిపారు. దీన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించేలా చూడాలన్నారు. మహిళలు లేడీస్ క్లబ్ ఆవరణలో వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల బొమ్మలను అలంకరించి, చూడముచ్చటగా తయారు చేశారు. సంక్రాంతి పండుగ ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన బోగి సెట్ ఆకట్టుకుంది. సీతారాముల పట్టాభిషేకం, చిన్ని కృష్ణుని బాల్యానికి సంబంధించిన బొమ్మలు, దేవి నవరాత్రులు ప్రతిబింబించేలా నవదుర్గలు, క్రిస్మస్ పండుగకి సంబంధించిన చర్చి, జీసస్ బొమ్మలు అందరిని ఆకట్టుకున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామాగ్రి దగ్ధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

షార్ట్ సర్క్యూట్ కారణంగా పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన కవిత ఇంట్లో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. పనిపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు నిత్యావసర సరుకులు, సామాగ్రి కాలి బూడిదయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. ప్రమాదం విషయం తెలుసుకొని కవిత హుటాహుటిన ఇంటికి చేరుకొని విలపించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

అధికారులతో ప్రత్యేకాధికారి సమీక్ష



నవతెలంగాణ-లక్సెట్టిపేట

మండల ప్రత్యేక అధికారి బి.సంజీవరెడ్డి గ్రామసభల నిర్వహణపై సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి వాటిపై ప్రజాపాలనలో నమోదు చేసుకుంటే గ్రామ సభకు హాజరై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ, వ్యవసాయ అధికారి శ్రీకాంత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

22,23 తేదీల్లో గ్రామ సభలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి మండలంలోని 17 గ్రామపంచాయతీలలో ఈ నెల 22,23 తేదీలలో రైతు భరోసా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జోత్స్న తెలిపారు. 22న పెరకపల్లి, లంబాడితండా, మాల గురిజాల, భూదాకలన్ చంద్రవెల్లి, కన్నాల, అంకుశం, బట్వాన్‌పల్లి, బుధకుర్దు గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరుగుతాయని తెలిపారు. 23న లింగాపూర్, సోమగూడెం, ఆకెనపల్లి, గురజాల, పాత బెల్లంపల్లి పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. గ్రామసభలలో రేషన్ కార్డుల లబ్దిదారుల వివరాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు ఎంపిక జాబితాలో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవచ్చుని తెలియజేశారు. గ్రామ సభలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వ అవకాశం కల్పించిందన్నారు. రైతు భరోసా పంపిణీ పథకంలో భాగంగా సాగు లేని వ్యవసాయ భూములకు గుర్తింపు చేపట్టామని, గ్రామ సభలలో వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 25 నుండి 28 వరకు జరిగే సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి లంక రాఘవులు కోరారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాల దిక్సూచి, పోరాటాల సారధి, కష్టజీవుల గొంతుక అయిన సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు నాలుగు రోజుల పాటు సంగారెడ్డి పట్టణంలో జరుగుతాయని తెలిపారు. నిరంకుశంగా పాలించిన బీఆర్ఎస్‌ను ఓడించి ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మారింది తప్ప ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఒకటి, రెండు గ్యారంటీలను అరకొరగా అమలు చేసి చేతులు ఎత్తేసే పని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. గత మహాసభల తర్వాత మూడు సంవత్సరాల కాలంలో చేసిన ఉద్యమాలను సమీక్షించుకొని అనుభవాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. మూడేండ్ల కాలంలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు, నిర్వాసిత రైతుల సమస్యలపై సమరశీల, కార్మిక పోరాటాలు నిర్వహించామని పేర్కొన్నారు. మహాసభల్లో రాష్ట్రంలోని ప్రజలను ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేసి రాబోయే మూడు సంవత్సరాల కోసం భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందిస్తారని తెలిపారు. నూతన రాష్ట్ర కార్యదర్శితో పాటు రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.మంజుల, ఎస్.స్వామి, నాయకులు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, లంక జమున, కోవే శకుంతల, లలిత, పంచపూల విజయ, పొచ్చక్క, ఆరిఫాబేగం, ఆశన్న పాల్గొన్నారు.

భద్రతకు బ్యాంక్ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- నిర్మల్ ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్

బ్యాంక్ అధికారులు భద్రత పరంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. జిల్లాలో ఒక్క బ్యాంక్‌లో కూడా దొంగతనం జరగవద్దనే ఉద్దేశంతో అన్ని బ్యాంక్ అధికారులతో సోమవారం భద్రత చర్యల నిమిత్తం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఖాతాదారులతో లావాదేవీలు నిర్వహిస్తున్న వివిధ శాఖలకు చెందిన బ్యాంకులు భద్రత చర్యలను పటిష్ట పరచుకోవాలన్నారు. పోలీస్ అధికారులందరూ వారి వారి పరిధిలోని మండల కేంద్రంలోని వివిధ శాఖలకు చెందిన బ్యాంకులను ఆకస్మికంగా సందర్శించాలని పేర్కొన్నారు. బ్యాంకు పరిసరాల చుట్టు ప్రాంతాలను, బ్యాంకు లాకర్లను ఆయా బ్యాంకుల మేనేజర్లు సిబ్బందితో కలిసి పరిశీలించాలని తెలిపారు. ప్రతిరోజు బ్యాంకు మూసి వేసేముందు, లాకర్లు వాటి అలారమ్ సిస్టమ్ సరిగా పనిచేస్తున్నాయా లేదా, పటిష్టంగా ఉన్నాయా లేదా, బ్యాంకు నగదు లావాదేవీలు ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల పర్యవేక్షణలో సరిచూసుకోవాలని తెలిపారు. ఏటీఎంలో వద్ద సీసీ కెమెరాలు అన్ని దిక్కుల ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏటీఎంలలో అలారమ్ సిస్టమ్ పనిచేస్తుందా లేదా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలన్నారు. ఇటీవల పట్టణంలో ఒక వ్యక్తి ఏటీఎంలో దొంగతనానికి పాల్పడితే ఆ బ్యాంకు మేనేజర్‌కి అలారమ్ రావటంతో వెంటనే డయల్ 100కి కాల్ చేయటంతో దొంగ పట్టుబడ్డాడని తెలిపారు. పోలీస్ శాఖ అనునిత్యం అందుబాటులో ఉండి భద్రత చర్యలను పర్యవేక్షిస్తుందన్నారు. బ్యాంకుల పరిధిలో ఏమైన భద్రత సమస్యలు తలెత్తుతే పోలీసు వారికి సమాచారం అందజేసి భద్రత చర్యలను కట్టుదిట్టం చేసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంక్ పరిసర ప్రాంతాలలో నివసించే వారిపై అనుమానాస్పదంగా ఉంటే దగ్గరలోని పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఉపేందర్‌రెడ్డి, రాజేష్ మీనా, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్, జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఇచ్చోడ: మండలంలోని బోరిగామ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల 2004-05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఎక్కడెక్కడో స్థిర పడి రెండు దశాబ్దాల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్మృతులను, మధురానుభూతులను నెమరేసుకున్నారు. ముందుగా పూర్వ విద్యార్థులు తమకు విద్య బోధించిన నాటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యాబుద్ధులు నేర్పి సంస్కారాన్ని అందించిన ఆనాటి గురువులు దైవ సమానులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రావ్, విద్యాసాగర్, భరత్‌కుమార్, గంగాధర్, దేవిదాస్, అంజలి, రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ పథకాలు అందేలా చూడాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్, మాల్యాల గ్రామాల్లో నాలుగు పథకాలకు సంబంధించిన సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా రైతు భరోసా సర్వే వివరాలను సంబంధించిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట సాగుకు యోగ్యత లేని రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన, మైనింగ్ చేస్తున్న, నాలా కన్వర్షన్ అయిన, రియల్ ఎస్టేట్ వెంచర్లను గుర్తించి జాబితాలోంచి తొలగించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో 22 నుంచి 24 వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసుకొని పథకాలకు గుర్తించిన లబ్దిదారుల పేర్లను చదివి వినిపించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జితేందర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణ్, తహసీల్దార్ సత్యనారాయణరావు, ఏవో కైలాష్, ఎంపీఓ సత్యానంద్, నర్సాపూర్ కార్యదర్శి రూపావత్ సునీల్ నాయక్, మాల్యాల కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు సైతం తెల్ల రేషన్‌కార్డుల పంపిణీ



నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సైతం తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. సోమవారం శ్మశన వాటికలో నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులు పరిశీలించి తర్వాత రిటైర్డ్ కార్మికులకు రేషన్ కార్డుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్య వైద్యంలో మంచిర్యాలను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉండే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసి పూర్తిగా ప్రజల్లో మమేకమవుతామన్నారు. ఇప్పటికే అనేకంగా అభివృద్ధి పనులు పురోగతి దిశలో ఉన్నాయని, ఐబీ స్థలంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన జరుగుతోందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఫిష్ పాండ్ మంజురు కాగా టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, శ్మశాన వాటిక నిర్మాణ పనులు చకచక సాగుతున్నాయని తెలిపారు. గోదావరి ఒడ్డున తీసిన మట్టిని శ్మశాన వాటికకు వినియోగించామని, మాజీ ఎమ్మెల్యే ఆరోపించినట్లు అమ్ముకోలేదని వివరణ ఇచ్చారు. జాతీయ స్థాయిలో ఒకటి రెండు చోట్ల మినహా ఇలాంటి శ్మశాన వాటిక లేకపోవచ్చుని, నాలుగు ఎకరాల విశాలమైన స్థలంలో రూ.5కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతోందని తెలిపారు. వచ్చే నెల 9,10 తేదీల్లో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో పాటు ఇరువు మంత్రులు మంచిర్యాలకు రానున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఇతర పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో సోమవారం ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై దివ్యభారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రిన్సిపల్ సందీప్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఫుడ్ ఫెస్టివల్‌ని ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన 46 రకాల వంటకాలను రుచి చూశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కేవలం తెలంగాణ రాష్ట్ర రుచులే కాకుండా సౌత్, నార్త్‌కు సంబంధించిన వంటకాలు విద్యార్థులు



తయారు చేయడం పట్ల అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్సై సాయికుమార్, ఏఎస్సై జీవన్, ప్రిన్సిపాల్ సందీప్, ఉపాధ్యాయులు అమోల్, అతుల్, అనిల్, రాకేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

పేద విద్యార్థుల ఫీజు చెల్లింపు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదువుకుంటున్న 5 గురు అమ్మానాన్న లేని నిరుపేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యులు శంకర్‌రావు, డాక్టర్ ఎం.రవి కుమార్ రెడ్డి, మంత్రి శ్రీనివాస్ గుప్త, ఎం.శ్రీనివాస్ యాదవ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫీజు చెల్లించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కూనింటి చంద్ర మోహన్‌రెడ్డి, లయన్స్ రీజియన్ సెక్రటరీ వట్టిమల్ల నర్సయ్య, క్లబ్ సెక్రటరీ మేకల శ్రీనివాస్ యాదవ్, ఉప ప్రధానాచార్యులు శ్రీమతి కట్టా రేఖ, ఉపాధ్యాయులు బాలయ్య, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



గుంతల రోడ్డుపై నరకయాతన

- మూడు మండలాలకు కలిపి వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి దుస్థితి
- 17కిలో మీటర్లు గుంతలమయం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గ్రామాల అభివృద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి చేస్తోంది. అందులో భాగంగా మూడు మండలాలను కలుపుతూ మహారాష్ట్రకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారి ఎక్కడ చూసిన గుంతలమయంగా మారి ప్రయాణికులను నరకయాతన పెడుతోంది. ఆ రహదారి గుండా ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాలను కలుపుతూ మహారాష్ట్ర జివితి వెళ్లే రహదారి కావడంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించేవారు కూడ ఎక్కువే, గత వర్షకాలం కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో పాటు లోలెవల్ బ్రిడ్జిల వద్ద కోతకు గురయ్యాయి. దీంతో ఆ రోడ్డు ప్రమాద కరంగా మారింది. ఆ మార్గం గుండా ద్విచక్రవాహనదారులు, 108 అంబులెన్స్‌లు సైతం వెళ్లలేని పరిస్థితులున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంద్రవెల్లి మండలంలోని దోడంద, గటేపల్లి, ఉట్నూర్, నార్నూర్ మండలంలోని నర్సాపూర్, చోర్‌గావ్ తదితర మండలాలకు కలిపే రహదారి చోర్‌గావ్ నుంచి గాదిగూడ అక్కడ నుంచి మహారాష్ట్ర జివితి తాలుకాను కలిపే రహదారి గత ప్రభుత్వం హాయంలో వేసిన బీటీ రహదారి కంకర తేలి గుంతలమయంగా మారింది. ఏదైనా సంఘటనలు జరిగినపుడు అత్యావసర సమయంలో 108 అంబులెన్స్ సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. ఈ రోడ్డు గుండా వారసంతలకు వెళ్లే దోడంద, గటేపల్లి, చిక్రంగూడ, కొలాం గూడ, నర్సాపూర్, జైత్రంతండా, గోటి పటార్, సాక్రా తదితర గ్రామాల ప్రజలు ఇంద్రవెల్లి వారాంతపు సంతతో పాటు వివిధ వ్యవసాయ, నిత్యావసర సరుకుల కోసం వస్తుంటారు. ఈనెల 28న ప్రారంభమయ్యే కేస్లాపూర్ జాతరకు సైతం మహారాష్ట్ర జివితి నుంచి గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్ మండలాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. వారు ఈ నరకయాతనను అనుభవించాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బీటీ రోడ్డు నిర్మించాలి



ఇంద్రవెల్లి నుంచి తమ గ్రామం 7కిలోమీటర్ల మేర కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. తరుచూ తమ ద్విచక్ర వాహనాలు చెడి పోతున్నాయి. అత్యవసర సమయంలో ఆటోలు రూ.500 వరకు చెల్లించాల్సి వస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రతినిత్యం నరక యాతన అనుభవిస్తున్నాం.

వావల్కర్ సుభాష్ నర్సాపూర్ గ్రామస్తుడు, ఉట్నూర్

108 అంబులెన్స్ రావాలంటే తిప్పలు



తమకు అత్యావసర సమయాల్లో సైతం 108 అంబులెన్స్ రావాలన్న తిప్పలు పడాల్సిందే. కంకర తేలిన రోడ్డు గుంతలుగా మారడంతో సకాలంలో అంబులెన్స్ రావడం లేదు. దీంతో అత్యావసర సమయంలో వాహనం చేరక పోవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వైద్య సేవలకు వెలుతున్నాం. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు ఈ రోడ్డుపై దృష్టి సారించాలి.

చిక్రం ప్రభు, గ్రామం చక్రంగూడ

విద్యతోనే సమాజంలో గుర్తింపు

- ఎంఐఎం ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మెహ్రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలని ఎంఐఎం జిల్లా ఇన్‌చార్జి, యాకుట్‌పుర ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మెహ్రాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని బాలక్ మందిర్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎంఐఎం ఆధ్వర్యంలో ముద్రించిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్ మెహ్రాజ్ మాట్లాడుతూ పదో తరగతిలో విద్యార్థులు ఉన్నతంగా రాణించేలా ఎంఐఎం తరుపున ఉచితంగా ఉర్దూ మీడియం విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాన్ని అందిస్తున్నామన్నారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధిస్తు, జిల్లాతో పాటు స్కూల్, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఆ దిశగా విద్యార్థులను మరింత ప్రోత్సహించేలా తమ వంతుగా ఆల్ ఇన్ వన్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుసా నిఖత్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఎంఐఎం నాయకులు మహ్మత్ రోహిత్, షానవాజ్, సిరాజ్ ఖద్రి, ఇనాయత్, ముదస్సిర్‌షా, సలీం, షాహింద్ అహ్మద్ తవక్కల్ ఉన్నారు.

చర్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-తలమడుగు

బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. గ్రామంలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో గ్రామస్తులు బాధపడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలో కొంతమందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వివిధ రకాల వ్యాధులు గుర్తించి రోగులను రిమ్స్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు హరీష్, సిబ్బంది చిన్నయ్య, శ్రీనివాస్, ఝరి పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, గంగారాం పటేల్, రామ్‌రెడ్డి, బాలవికాస్ జిల్లా డైరెక్టర్ దెబ్బడి అశోక్, ప్రసూన్‌రెడ్డి, గ్రామ యువజన సంఘం సభ్యులు వరుణ్ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు



నవతెలంగాణ-నార్నూర్

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్వీ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలని ఫుడ్ ఫాయిజాన్‌తో అనేక మంది విద్యార్థులు ఆస్పత్రికి పాలవుతున్నారని గురుకుల హస్టల్స్ కానీ కస్తూర్బా హస్టల్స్‌లో కానీ తనిఖీ చేసి విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేయాలని, జిల్లాలోని బీఆర్ఎస్వీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్టు తెలిపారు.

'అవగాహనా సదస్సులు చేపడుతున్నాం'



నవతెలంగాణ-నిర్మల్

సమాచార హక్కు చట్టంపై ఆయా జిల్లాల్లో ప్రజల్లో విస్తృత అవగాహన సదస్సులు చేపడుతున్నామని సయ్యద్ హైదర్ అన్నారు. అందులో భాగంగానే సోమవారం సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా శ్రీపెల్లి సుభాష్‌ను నియమించినట్టు, దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిర్మల్‌తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రామస్థాయిలో ఆర్టీఐ కార్యకర్తలను తయారు చేస్తున్నామని అన్నారు. గ్రామస్థాయి, మండల, డివిజన్, జిల్లా కమిటీలను పటిష్ట పరుస్తున్నామని తెలిపారు. కమిటీల నియామకం అనంతరం విద్యాసంస్థలలో సదస్సులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

పరీక్ష తీరును పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆరోగ్య పాఠశాలలో భాగంగా టాప్-3లో నిలిచిన స్టూడెంట్ ఛాంపియన్ విద్యార్థులకు డైట్ కాలేజ్‌లో నిర్వహిస్తున్న ఫైనల్ ఎగ్జామ్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షిషా సోమవారం పరిశీలించారు. ఆరోగ్య పాఠశాల జిల్లా స్థాయి పోటీలు డైట్ కళాశాలలో జరిగాయి. 18 మండలాల నుంచి ముగ్గురేసి చొప్పున మండల స్టూడెంట్ ఛాంపియన్స్ హాజరయ్యారు. ఇందులో నుంచి జిల్లా స్థాయిలో మొదటి ముగ్గురిని సెలెక్ట్ చేసి, 26 జనవరి రోజు రిపబ్లిక్ డే కార్యక్రమాలలో భాగంగా వారికి సర్టిఫికెట్, నగదు పురస్కారం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా పరీక్ష నిర్వహణను పరీక్షించి పలు సూచనలు చేశారు. డీఈఓ ప్రణీత పర్యవేక్షణలో ఈ పోటీలను ఆరోగ్య పాఠశాల జిల్లా కన్వీనర్ డి.అజయ్ కుమార్, ఆరోగ్య పాఠశాల రిసోర్స్ పర్సన్స్ బృందం నిర్వహించారు.

రైతు కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-నార్నూర్

బ్యాంక్ అధికారుల వేధింపులకు గురై ఆత్మహత్య చేసుకున్న రైతు జాదవ్ దేవ్‌రావ్ కుటుంబానికి రూ.50లక్షల నష్టపరిహారం ఇవ్వాలని బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో గాంధీచౌక్ వద్ద బంజారా నాయకులతో కలిసి మాట్లాడారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారిని ఆదుకోవాలన్నారు. ముందుగా దేవ్‌రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, జేఏసీ మాజీ చైర్మెన్ ఉత్తం రాథోడ్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, నాయకులు డిగాంబర్ ఆడే, పేసా చైర్మెన్ సికిందర్, మాజీ జెడ్పీటీసీ బ్రిజులాల్, యశ్వంత్ రావ్, వసంత్ ఆడే, చౌహాన్ మహేందర్, రాథోడ్ రమేష్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

భారతీయ జనతా పార్టీ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజి కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్థానిక బీజేపీ కార్యాలయంలో సంవిధాన్ అభియాన్ కార్యాశాల జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాజ్యాంగ దినోత్సవాన్ని 2015 నవంబర్ 26న అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించారు. రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో సంవిధాన్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించారన్నారు. రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు రాజ్యాంగం ద్వారానే నరేంద్ర మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, సంవిధాన్ అభియాన్ కార్యక్రమ జిల్లా కన్వీనర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు, కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్లు రాచకొండ సాగర్, ఆరోన్ లాల్, జిల్లా ఉపాధ్యక్షులు అలివేలుమంగ, కమల్ నయన్ పాల్గొన్నారు.

దైవ దర్శనాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

- క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎంపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దైవ దర్శనాలకు వెళ్లే సమయంలో వాహనాల కండిషన్‌తో పాటు డ్రైవర్ల గురించి తెలుసుకోవాలని మాజీ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. సోమవారం జంగుబాయి ఉత్సవాలకు వెళ్తున్న క్రమంలో నార్నూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ చికిత్స పొందుతున్న వారిని ఆయన మంగళవారం పరామర్శించారు. క్షతగాత్రులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించేలా చూడాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌కు సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ దైవ దర్శనానికి వేళ్లే సమయంలో ఆదివాసులు వాహనాలతో పాటు అనుభవం ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసుకోవాలన్నారు. నార్నూర్ వద్ద జరిగిన ఘటన బాధాకరమన్నారు. ఈ ఘటనలో సూర్యగూడకు చెందిన పటేల్ మరణించారన్నారు. ఇద్దరిని నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్ కు రేఫర్ చేయడం జరుగుతుందన్నారు. త్వరలో కేస్లాపూర్ జాతర రానుందని భక్తులు జాగ్రత్తలు పాటిస్తు సురక్షితంగా దైవ దర్శనం చేసుకోని ఇండ్లకు చేరుకునేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఆత్రం వెంకటేష్, భూపెల్లి శ్రీధర్, ఆనంద్‌రావు, మర్సుకోల అశోక్ ఉన్నారు.

మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శ...

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న క్షతగాత్రులను రిమ్స్‌లో పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్నూర్ వద్ద జరిగిన ఘటనలో 35మంది గాయలతో రిమ్స్‌లో చిక్సిత పొందుతున్నారన్నారు. ఇందులో ఇద్దరు మరణించడం బాధకరమైన విషయమన్నారు. ఇద్దరికి హైదరాబాద్ రేఫర్ చేయడం జరుగుతుందన్నారు. గాయలపాలైన వారు పూర్తిగా కొలుకునే వరకు రిమ్స్ వైద్యులు అందించే వైద్యం తీసుకోవాలని కోరారు.

ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ అమలు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయాలని సోమవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆర్టిజన్ కార్మికులు టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలో గత (18) సంవత్సరాలపైబడి విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికులమైన మమ్ములను పర్మినెంట్ చేస్తామని ఉద్యమ సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారన్నారు. అప్పట్లో కొంతమంది నిరుద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కాంట్రాక్టు కార్మికులను రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2018 సెప్టెంబర్ 18న 12(3) ఇండస్ట్రియల్ డిస్పుట్స్ యాక్ట్1947 ప్రకారం పర్మినెంట్ చేసుకొనే వెసులు బాటును విద్యుత్ సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి కల్పిస్తూ తీర్పు వెలువరించిందన్నారు. ఒక్కో సబ్ స్టేషన్‌లలో 5 గురు చేయాల్సిన పనిని ఇద్దరితో చేపిస్తున్నారని, 365 రోజులలో 450 పైన డ్యూటీలు చేస్తున్నామని వాపోయారు. స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ ప్రకారం 8 గంటల షిఫ్ట్ డ్యూటీ, వారంతపు సెలవు, ఓవర్ టైం చేపిస్తే ఓవర్ టైం వేతనం ఇవ్వాలని ఉన్నప్పటికి ఇవ్వకుండా కార్మిక చట్టం ప్రకారం శ్రమ దోపిడి, వెట్టి చాకిరికి గురవుతున్నామన్నారు. ఈ రిలే నిరాహార దీక్షల్లో మధు, కృష్ణ, శ్రీనివాస్, వసీం, అశ్ఫక్, పోశెట్టి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు గ్రామసభల్లో పాల్గొనాలి



నవతెలంగాణ-తాంసి

ఈనెల 21 నుంచి 25వ తేదీల్లో ప్రతి గ్రామంలో నిర్వహించే గ్రామ సభల్లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలు తప్పకుండా పాల్గొని అర్హులను గుర్తించాలని, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని వడ్డాడి గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.5లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన భోజనశాల షెడ్డును డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డితో పాటు మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ముఖ్యఅతిథితో పాటు పలువురిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. ఆలయానికి ప్రహరీ గోడతో పాటు ముత్తడి వాగు ప్రాజెక్ట్ కింద గల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించే విధంగా చూడాలని గ్రామస్తులు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు మాటలతో పాటు కొబ్బరికాయలు కొట్టడానికి పరిమితమయ్యారని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి గ్రామానికి నిధులు కేటాయించి, పనులు పూర్తయిన తర్వాతనే ప్రారంభోత్సవాలకు వస్తున్నామన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఆలయానికి ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.20లక్షల నిధుల మంజూరు వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. రైతు బరోసా, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయం లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ఉపాధి హామీ కూలీలకు రూ.12వేల చొప్పున ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులైన ప్రతినిరుపేదకు అందే విధంగా చూసి అధికారులకు తెలియజేయాలన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని అన్నారు. అనంతరం గత మూడు రోజులుగా బాజీరావు బాబా సప్తమి వేడుకలు కొనసాగడంతో సోమవారం రోజుతో చివరి రోజు ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, సంతోష్, నారాయణ, గంగన్న, హన్మండ్లు, గంగాధర్, బద్దం పోతారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీకాంత్, పోతన్న, పలువురు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
3
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-బెజ్జూర్



ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద వహించాలని జాతీయ మానవ హక్కుల సభ్యులు ఆత్రం లింగోరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమం ఉన్నత పాఠశాల(బాలికలు)ను తనిఖీ చేశారు. పాఠశాలలోని సమస్యలు, విద్యార్థుల డైట్ మెనూ, టీచర్స్ అవైలబలిటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థునులు ప్రహరీ ఎత్తు పెంచాలని, క్రీడా మైదానం, సోలార్ వాటర్ హీటర్ సమస్యలను తెలియజేశారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. వారితో పాటు పెంచికల్‌పేట్ రాయిసెంటర్ సార్మెడి పోర్తేటి ప్రభాకర్, బెజ్జూర్ రాయిసెంటర్ సార్మెడి రమేష్, రాయి సెంటర్ సభ్యులు ప్రశాంత్, సత్యవన్, గణేష్, శ్రీహరి, సత్యం ఉన్నారు.

శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈనెల 31న కెరమెరి మండలం అనార్పల్లిలో నిర్వహించే శ్రీనివాస కళ్యాణ మహోత్సవానికి జిల్లాలోని ప్రముఖులకు నిర్వహణ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రితో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవలక్ష్మిలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బదావత్ ధనరాజ్ సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్ లాల్ మాట్లాడుతూ కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుండి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు, పది గంటలకు కళ్యాణ మహోత్సవం నిర్వహించి, హోమంతో పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ధనరాజ్, నిర్వాహకులు వెంకట్, సురేష్, రాహుల్, విజేశ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్సీ సమక్షంలో పలువురి చేరిక



నవతెలంగాణ-కౌటాల

పేదల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్‌లో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై మాజీ ఎంపీటీసీ రవి దంపతులు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వారితో పాటు గ్రామ యువకులు సుమారు 150 మంది వరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ పేదప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, త్వరలోనే రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు జారీ చేస్తుందన్నారు. ముత్తంపేట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కౌటాల, చింతలమానేపల్లి మాజీ ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య టీపీసీసీ సభ్యులు అర్షాద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీవార్ధన్, నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిని విమర్శిస్తే సహించేది లేదు



నవతెలంగాణ-బెజ్జూర్

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ను విమర్శిస్తే సహించేది లేదని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆత్రం రాజారాం అన్నారు. సోమవారం మండలంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఉంటూ పత్రిక సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇది పార్టీ ధిక్కరణ కిందికి వస్తుందని తెలిపారు. దశాబ్ద కాలంగా పార్టీని పట్టుకొని కష్టపడ్డ కార్యకర్తలకు కాకుండా దొంగలకు అందలమెక్కిస్తున్నామని చెప్పడంలో తప్పేముందని ప్రశ్నించారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడని వారు నియోజకవర్గ ఇన్‌చార్జిపై మాట్లాడితే ఉరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు బూస శంకర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అబ్దుల్ హకీమ్, నాయకులు జాహిద్ హుస్సేన్, కొండ్రా నరేందర్ గౌడ్, కోట్రంగి రామకృష్ణ, మాజీ సర్పంచ్ పొర్తెటి రవి, పి.సత్తయ్య చండే బాబురావు, సుంకరి విష్ణుమూర్తి చారి, మురళి గౌడ్, దుర్గం దాసు, పొలాజి సత్తయ్య పాల్గొన్నారు.

ఒకే పార్టీలో ఉండి విమర్శలు చేయడం సరికాదు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

కాంగ్రెస్‌లో కొనసాగుతూ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆయన వెంట తిరిగే మండల నాయకులపై విమర్శలు చేయడం సరికాదని మాజీ జడ్పీ చైర్మన్ సిడం గణపతి, మాజీ ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల రావి శ్రీనివాస్ ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులతో దండే విఠల్ మంచోడే కానీ ఆయన వెంట తిరిగే మండల నాయకులు భూకబ్జాదారులని విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు, మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తాము కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిస్తారీ సత్యన్న, మేకల ప్రసాద్, శ్రీనివాస్, ఉప్పులం మహేష్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ రంగాలలో రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సజీవన్, బీసీ స్టడీ సర్కిల్ ఆదిలాబాద్ డైరెక్టర్ జి.ప్రవీణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 నుండి 4 నెలల ఉచిత శిక్షణ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆధాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. లక్ష50వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలలోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 20 నుండి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 12 నుండి 14 వరకు ధృవపత్రాల పరిశీలన ఉంటుందని, ఇతర వివరాలకు 08732-221280 నంబర్ సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుండి గ్రామసభలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికను చేయడం జరుగుతుందని తహసిల్దార్ రియాజ్ అలీ తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ గ్రామ సభలకు ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు పాల్గొనాలన్నారు. ఇందులో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా అన్ని పథకాలపై వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మండలంలోని బూరుగూడ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడ గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్, నాబార్డు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరానికి నాబార్డు అధికారి కౌశిక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం నాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రజల ఆరోగ్యం కోసం జిల్లా పరిధిలో ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య



కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. మెగా వైద్య శిబిరంలో రక్త పోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, మందులు అందిస్తున్నట్టు తెలిపారు. నాబార్డు ద్వారా ఆసిఫాబాద్ మండల కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ అంశంపై గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు స్థానికంగా ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన గ్రామాలలో నిర్వహించే జాతరలు, వర్ధంతి సభలు, మార్లవాయి, జంగుబాయి, జోడేఘాట్‌లో జిల్లా యంత్రాంగం తరపున ప్రత్యేక కార్యచరణ రూపొందించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిబిరాలకు మంచి స్పందన రావడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం గ్రామంలోని బూరుగూడపల్లె దవాఖానను సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో పారిశుద్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రతిమ ఫౌండేషన్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులను శాస్త్రీయంగా గుర్తించండి

- ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు



నవతెలంగాణ-కౌటాల

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను శాస్త్రీయంగా గుర్తించాలని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా గృహానికి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రజల్లో అనేక అపోహలు, అనుమానాలున్నాయని, వాటన్నిటిని గ్రామసభల ద్వారా నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడా పక్షపాతం గాని తారతమ్య బేధాలు లేకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, ఎంపీడీఓ కోట ప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ ముష్కుర్ అలీ, హౌసింగ్ డీఈ వేణుగోపాల్ రెడ్డి, పంచాయితీ సెక్రటరీ సాయికృష్ణ, బీజేపీ జిల్లా కోశాధికారి బండి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు కుంచాల విజయ్, మాజీ ఎంపీటీసీ దుర్గం మోతిరాం, మేకల తిరుపతి, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు, రైతు భరోసా తదితర పథకాలను పేద, మధ్యతరగతి ప్రజలకు అందేలా చూడాలని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా గృహ నిర్మాణానికి ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ప్రజల్లో అనేక అపోహలు, అనుమానాలు ఉన్నాయని, వాటన్నిటిని గ్రామసభల ద్వారా దూరం చేయాలన్నారు. అర్హులైన వారికి పథకాలను అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏఓ గిరీష్, హౌసింగ్ డీఈ వేణుగోపాల్ రెడ్డి, చనకపురే లావణ్య, నీరటి సత్యనారాయణ, ఒడ్డేటి నాణయ్య, నేరెళ్ల అశోక్, చౌదరి తిరుపతి, ఎలుములే కిషోర్, షామీర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములపై దాడిని నిరసిస్తూ సోమవారం ఉపాధ్యాయులు నిరసనలు తెలియజేయాలని ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా వేంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఇందులో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హనుమయ్య, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి, రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో ఓ అరాచక శక్తుల జోక్యం పట్ల కఠినంగా వ్యవహరించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలన్నారు. గత నెల 21 పాఠశాల ఆవరణలో 8వ తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్న క్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు మోకాలు పొరపాటున అయ్యప్ప మాల వేసుకున్న విద్యార్థికి తగిలిందనే నేపంతో పాఠశాలతో ఏమాత్రం సంబంధంలేని భక్తుల ముసుగులో ఉన్న అసాంఘిక శక్తులు పాఠశాలలోకి చొరబడి దాడి చేసి అసభ్యకర పదజాలంతో దూషించటంతో పాటు విద్యార్థి కాళ్లు మొక్కించి అవమానించారని తెలిపారు. ఉపాధ్యాయులపై దాడులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జిల్లా నాయకులు ప్రకాష్, శ్యాంసుందర్, మండలం నాయకులు హరీష్, భాజీ ఖాన్, ఉపాధ్యాయులు ఓం ప్రకాష్, లక్ష్మీనారాయణ, మాధవి, మురళి, సీఆర్పీలు రమేష్, పవన్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 26న 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి గణతంత్ర వేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో జరగనున్న వేడుకలను అధికారులు సమన్వయంతో కృషి చేసి జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. ఈ నెల 24 వరకు ప్రశంసా పత్రాలు సిద్ధం చేయాలని, గణతంత్ర దినోత్సవం రోజున ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించనున్నందున ఏర్పాటు చేయాలని తెలిపారు. వేడుకలలో భాగంగా ప్రశంసా పత్రాలు, శకటాల ప్రదర్శన, ఆయా శాఖలకు సంబంధించిన స్టాళ్ల ఏర్పాటు, ప్రసంగ ప్రతి, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు ఇతరత్రా అన్ని కార్యక్రమాల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. శకటాలు స్టాల్స్ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రేక్షకులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందులో అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : సబ్ కలెక్టర్



నవతెలంగాణ-బెజ్జూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసాను అర్హులైన వారందరికీ దక్కేల చర్యలు తీసుకుంటామని, అధికారులు అర్హుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 26 నుంచి 4 పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుందని అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ భూమేశ్వర్, వ్యవసాయ అధికారి నాగరాజు, ఆర్ఐ సంతోష్, ఏఈఓలు మీనా, మారుతి ఉన్నారు.

బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మేరగూడ గ్రామంలో కొలువైన పురాతమైన గొంతెమ్మ ఆలయంలో సోమవారం బోనాల పండుగ సందర్భంగా సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ గొంతెమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చపిడె సత్యనారాయణ, మండలాధ్యక్షుడు చపిడె రాజేశ్వర్, మాజీ ఎంపీపీలు దూగుండ రాజన్న, అన్నం గణపతి, జునుగరి మధూకర్ పాల్గొన్నారు.

గ్రామసభలకు లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరు కావాలి

నవతెలంగాణ-వాంకిడి

గ్రామసభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎంపీడీఓ వి.ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలకు ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా గ్రామసభకు ఒక రోజు ముందే దప్పు చాటింపు వేయ్యాలన్నారు. ప్రజాపాలనలో నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా రైతు భరోసా, ఇంద్రమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఇంద్రమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో వారి పేరు రాకుంటే గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని, గ్రామసభలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామసభలకు ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ ఆలీ, మండల వ్యవసాయ అధికారి, ఎంపీఓ, డీటీ, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 21, 22, 23 మూడు రోజుల పాటు ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ అల్బర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుండి అమలుకాబోయే పథకాల్లో పేర్లు లేని వారు గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు గ్రామసభలో పాల్గొని ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలను అందేలా చూసుకోవాలన్నారు.

తిర్యాణీ : నేటి నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎంపీడీఓ మల్లేష్ కోరారు. ప్రజాపాలనలో నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా రైతు భరోసా, ఇంద్రమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, ఇంద్రమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన అర్హుల జాబితాను గ్రామసభల్లో ప్రకటించడం జరుగుతుందన్నారు. 21న గోవెన, ఉల్లిపిట్ట, 22న దేవైగూడ, మాణిక్య పూర్, రొంపల్లి, ముల్కల మంద, మొర్రిగూడ, ఏదుల పపాడు, గోపేరా, నాగు గూడా, భీంజిగూడ, మందగూడ, గ్రామ పంచాయతీలలో, 23న నాయకప గూడ, సుంగపూర్, రాజ గూడా (గుండాల) గోయగం, కన్నెపల్లి, కౌటగామ్, గుడిపేట్, కైరిగూడ, మర్కగూడ, పంగిడి మాధర, 24న గంభీరావుపేట్, చింతపల్లి, మేస్రం గూడ, తలాండి, గడలపల్లి, గిన్నె దారి, మంగి, తిర్యాణి గ్రామ పంచాయతీలలో గ్రామసభలు ఉంటాయని తెలిపారు.

నేటి నుండి పాఠశాలలకు పాత సమయసారణి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు చలి తీవ్రత నేపథ్యంలో మార్చిన టైం టేబుల్‌ను రద్దుచేస్తూ నేటి నుండి యధావిధిగా పాత టైం టేబుల్ ప్రకారం పాఠశాలలు పనిచేస్తాయని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుండి 4 గంటల వరకు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉదయం 9 గంటల నుండి 4:15 వరకు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు మార్చిన టైం టేబుల్ అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ఏఈ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కౌటాల, సిర్పూర్, చింతలమానేపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అదాలత్ ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
మంగళవారం | జనవరి 21, 2025 | www.navatelangana.com

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్



ట్రాఫిక్ నియమాలు పాటించి, ప్రమాదాలను నివారించాలని శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ అన్నారు. రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్‌లోని ఐటీఐ కళాశాలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం నేరమని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని అన్నారు. భద్రత నియమాలు పాటించడం వల్ల ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. అనంతరం విద్యార్థులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిపై ఫిర్యాదు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు పంగ లచ్చయ్య ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. వర్గీకరణపై అనుకూలమైన తీర్పు రావడానికి కృషి చేసిన మంద కృష్ణపై దాడులు జరిపైనా చంపుతామని మాలలను రెచ్చ గొట్టే విధంగా మాట్లాడుతున్నారని, అతనిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ ఇండియా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అట్కపురం రమేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలి



నవతెలంగాణ-తాండూర్

ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని ఎంసీపీఐ ఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి ఎంసీపీఐయు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు పది రోజులుగా నిలిచి పోవడంతో రోగాల బారిన పాడిన పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రులలో డయాలసిస్ లాంటి అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని రకాల ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారన్నారు. ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ కౌంటర్లను మూసివేశారని, దీంతో రెక్కాడితే గాని డొక్కాడని వ్యాధుల బారిన పడ్డ నిరుపేదలు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి యాజమాన్యాలతో చర్చలు జరిపి ఆరోగ్యశ్రీని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకాష్, చందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు గ్రామసభలు జరుగుతాయన్నారు. ఇందులో నూతన రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసాపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 23న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముర్ల ప్రదీప్ కోరారు. సోమవారం శిబిరానికి సంబంధించిన కరపత్రాలను స్థానికంగా పంపిణీ చేశారు. యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దాతలు 9014443974, 8688814328, 8374711425 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళం



నవతెలంగాణ-కాసిపేట

మండలం ముత్యంపల్లిలోని హనుమాన్ దేవాలయ నిర్మాణానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ, మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ రూ.10 వేల విరాళం అందించారు. సోమవారం ఆలయానికి వెళ్లి తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, హనుమాన్ ఆలయ కమిటీ కోశాధికారి ఇంగు నారాయణ, పట్టెం రాజేశం పాల్గొన్నారు.

గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఈశ్వర్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



గిరిజన సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన లకావత్ ఈశ్వర్‌ను నియమిస్తున్నట్లు జాతీయ అధ్యక్షుడు రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన విద్యార్థుల సమస్యలపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తా, గిరిజన విద్యార్థులకు సమస్య వస్తే తక్షణమే స్పందిస్తూ ఉంటూ, వారి ఉన్నత విద్యపై తన వంతు కృషి చేస్తానని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాధ్యతను నిర్వహిస్తానని తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘ బాధ్యులు ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భూమేష్, బోథ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, సుమర్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ వద్దని గ్రామస్తుల ధర్నా

- మూడు గంటల పాటు నిరసన
- అధికారుల హామీతో విరమణ



నవతెలంగాణ-హాజీపూర్

కార్పొరేషన్ వద్దని గ్రామ పంచాయతీగానే ఉంచాలని మండలంలోని నర్సింగపూర్ గ్రామస్తులు సోమవారం ధర్నా చేపట్టారు. ఇటీవల మంచిర్యాలను కార్పొరేషన్ చేస్తూ , మండలంలోని 8 గ్రామాలను విలీనం చేస్తూ గెజిట్ విడుదల కావడంతో నర్సింగపూర్ గ్రామస్తులు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి జాతీయ రహదారి 63 పై ధర్నాకు పూనుకున్నారు. గ్రామం నుండి 2 కిలోమీటర్ల దూరంలో వున్న జాతీయ రహదారి వరకు కాలినడకన చేరుకున్నారు. అప్రమత్తమై పోలీసులు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించి ధర్నాను నిలువరించే ప్రయత్నం చేశారు. అక్కడికి చేరుకున్న మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్తులు ధర్నాకు దిగడంతో కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. దీంతో వారు జాతీయ రహదారి పైకి రాకుండా రోడ్డు పక్కనే ధర్నా చేశారు. టెంట్, వంట సామాగ్రి తెప్పించుకుని న్యాయం జరిగే వరకు ఇక్కడే వుంటామని భీష్మించుకు కూర్చున్నారు. కలెక్టర్ రావాలి అంటూ మూడు గంటల పాటు నిరసన తెలపడంతో తహసీల్దార్, ఏసీపీలు వారి సమస్యను కలెక్టర్ దష్టికి తీసుకుపోతామని హామీ ఇవ్వడంతో నిరసన విరమింప జేశారు.

మాకు ఉపాధి పోతుంది..

నర్సింగాపూర్ గ్రామంలో 2500 జనాభా వుంటుంది.1300 ఓటర్లు ఉన్నారని ఇందులో 70 శాతం మంది కూలీ పని పైనే ఆధార పడి బ్రతుకుతున్నామని గ్రామస్తులు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాది కాలంలో వంద రోజులు ఉపాధి లభిస్తుందని, కార్పొరేషన్‌తో ఉపాధి హామీ పథకం కోల్పోయి తిండికి తిప్పలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దీన్ని ఖండించకపోవడంపై మండిపడ్డారు. నాయకులు అమ్ముడు పోయారని దుయ్యబట్టారు. పేదల ఉపాధి కోల్పోవడం అధికారులకు ,నాయకులకు పట్టడం లేదా అని, కొందరు నాయకులు అమ్ముడు పోయి దొంగ చాటున సంతకాలు చేశారని విమర్శించారు. రెండు రోజుల్లో మాకు న్యాయం చేయకపోతే ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేసులకు బయపడం న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామంటూ నినాదాలు చేసుకుంటూ నిరసన విరమించారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్



నవతెలంగాణ-జైపూర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్ డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట సోమవారం విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా కళాశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-నస్పూర్

రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప మాల ధరించిన మతోన్మాద శక్తులు చేసిన దాడిని ఖండిస్తున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అసంపల్లి రమేష్ తెలిపారు. సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్ 21వ తేదీన అయ్యప్ప మాల ధరించిన మతోన్మాద శక్తులు ప్రధానోపాధ్యాయుడు రాములు పై దాడికి పాల్పడ్డారని, దీనికి వ్యతిరేకంగా జనవరి 12వ తేదీన తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం హైదరాబాదులో జరిగిందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణలోని దాదాపుగా అన్ని ఉపాధ్యాయ సంఘాలు పాల్గొని ఉద్యమ కార్యక్రమానికి మద్దతును ఇచ్చాయని, అందులో భాగంగానే ఆర్కే-8లోని ప్రాథమిక పాఠశాలలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సరిత పాల్గొన్నారు.

తాండూర్ : ప్రధానో పాధ్యాయులు కంబాల రాములుపై దాడీ హేమమైన చర్య అని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు అన్నారు.





ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పిలుపు మేరకు సోమవారం స్థానిక ఎంపీయూపీఎస్ రడగంబాలలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గుర్రాల రాజావేణు మాట్లాడుతూ గత నెల 23న కొందరు వ్యక్తులు పాఠశాలలోకి చొరబడి విచక్షణా రహితంగా మూకుమ్మడిగా దాడికి పాల్పడటాన్ని ఖండిస్తున్నామన్నారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులపై దాడులు అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో ప్రధానోపాధ్యాయురాలు సుంకరి లక్ష్మి, ఉపాధ్యాయులు స్వర్ణలత, వసంత, తిరుపతి పాల్గొన్నారు. అదేవిదంగా మండలంలోని తంగళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మల్లేశం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పిలుపుమేరకు సోమవారం ఉపాధ్యాయులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయునిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో ప్రధానోపాధ్యాయురాలు సుంకరి లక్ష్మి, ఉపాధ్యాయులు స్వర్ణలత, వసంత, తిరుపతి పాల్గొన్నారు.

కోనో కార్పస్ మొక్కలు విషపూరితం కావని ప్రకటించాలి

నవతెలంగాణ-నస్పూర్



కోన కార్పస్ మొక్కలు విషపూరితం కావని కలెక్టర్ ప్రకటించి, ప్రజల్లో నెలకొన్న భయాందోళనను పోగొట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం ప్రజావాణిలో కోనో కార్పస్ మొక్కలు తొలగించాలని కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో హరితహారం పేరుతో గత ప్రభుత్వం, అధికారులు విషం చిమ్ముతున్న కోనో కార్పస్ మొక్కలను, చెట్లను జిల్లా వ్యాప్తంగా నాటించడం, పెంచడం జరిగిందని, డాక్టర్లు, పర్యావరణవేత్తలు ఈ మొక్కలతో మూగ జీవాలకు, ప్రజలకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయని, అదేవిధంగా భూగర్భ జలాలు మనుషులు వాడడానికి కూడా పనికిరాకుండా పోతాయని, పర్యావరణం దెబ్బతింటుందని చెబుతున్నారని తెలిపారు. ఇంతటి ప్రమాదకరమైనవాటిని తొలగించవలసిన బాధ్యత ప్రభుత్వం, అధికారులపై ఉన్నదని, కోనో కార్పస్ మొక్కలను, చెట్లను తొలగించాలని 2024 డిసెంబర్ 19న సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరో మారు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. కానీ కలెక్టర్ కోనో కార్పస్ మొక్కలు విషపూరితం కావని, కావాలని కొంతమంది ఎలాంటి ఆధారాలు లేకుండా మొక్కలను, చెట్లను తొలగించాలని చెప్పడం సరైనది కాదని చెప్పారని పేర్కొన్నారు. విషపు మొక్కలు కాకుంటే మంచి మొక్కలేనని ఎవ్వరు భయపడవద్దని కలెక్టర్ ప్రకటించి ప్రజల, పర్యావరణవేత్తల, డాక్టర్ల అనుమానాలను, భయాలను పోగొట్టాలని సీపీఐ(ఎం) కోరుతోందని అన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

డిగ్రీ ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం నాయక్, బీసీ స్టడీ సర్కిల్-ఆదిలాబాద్ సంచాలకులు జి.ప్రవీణ్‌కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 4 నెలల ఉచిత శిక్షణ ప్రారంభించడం జరుగుతుందని, అభ్యర్థులకు బుక్ ఫండ్, ప్రతి నెల స్టైఫండ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షల, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో టీజీబీసీస్టడీసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ఫిబ్రవరి 12 నుండి 14వ తేదీ వరకు సర్టిఫికేట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 08732-221280 నెంబర్‌లో సంప్రదించవచ్చని కోరారు.

ఫ్లెక్సీలను తొలగించాలని వినతి



నవతెలంగాణ-మందమర్రి

ఫ్లెక్సీలను తొలగించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జె.రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన కూడళ్లలో విపరీతంగా ఫ్లెక్సీలు పెట్టడంతో వాహనాదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. తక్షణమే వాటిని తొలగించాలని, ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం ఫ్లెక్స్ బోర్డులు ఏర్పాటుతో మున్సిపాలిటీకి నిధులు రావడం జరుగుతుందని, ఫ్లెక్సీ బోర్డుల ద్వారా మున్సిపాలిటీకి ఎంత మేరకు నిధులు జమ అయ్యాయో వెల్లడించాలని ప్రశ్నించారు. మందమర్రిలోని చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ కోసం రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు చేయడం జరిగిందని, ఆహ్లాదంగా ఉండాల్సిన వాతావరణం కాస్త ఫ్లెక్సీల ఏర్పాటుతో కళాహీనంగా మారిందన్నారు. ఇప్పటికైనా పట్టణంలో వెలసిన ఫ్లెక్సీ బోర్డులను తొలగించి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు, యూత్ విద్యార్థి సోషల్ నాయకులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-తాండూర్

మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) కాలసూచి డైరీని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎంఈఓ మల్లేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవదాస్, సంపత్ సీనియర్ నాయకులు ప్రకాష్, ఖగపతి, చంద్రశేఖర్, అశోక్, శంకర్ పాల్గొన్నారు

ప్రజావాణిలో భూ సమస్యలపై ఫిర్యాదు



నవతెలంగాణ-కాసిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలపై ఎంపీఓ శేక్ సఫ్దర్‌అలీకి పలువురు ఫిర్యాదు చేశారు. ముత్యంపల్లిలోని సర్వే 102లో తన భూమిని కబ్జా చేశారని బోండ్ల రవి తనకు న్యాయం చేయాలని కోరారు. కాసిపేట శివారులోని సర్వే నెంబర్ 293/ ఆ లోని తమ భూమిపై దౌర్జన్యం చేస్తున్నారని, భూమి విషయంలో మాకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని కోరుతూ దాసరి రాంచందర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ఆర్డీఓ శ్రీనివాసరావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలి

- ఐటీడీఏ ఎదుట ఆదివాసీ సంక్షేమ పరిషత్ ధర్నా

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసుల సమస్యలు పరిష్కరించాలని ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్ రాందాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇచ్చి ఆదివాసులకు శాశ్వత హక్కులు కల్పించాలన్నారు. 1/70 పేసా చట్టం, ఆర్ఓఎఫ్ఆర్, అటవీ హక్కులు ఏజెన్సీ ప్రాంత చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, ఏజెన్సీలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని, ఐటీడీఏ పరిధిలోని బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అర్హులైన పేద ప్రజలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులను అందించాలని కోరారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల నాయకులు నైతం బాలు మాట్లాడుతూ ఆదివాసుల డిమాండ్‌లను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసీ గూడెంలను ఏజెన్సీ ప్రాంతంగా గుర్తించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను కలిపి జోనల్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళ చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని ముత్తంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మహిళ చట్టాలపై కాగజ్‌నగర్ షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. సామాజిక మాధ్యమాలు ఫేస్‌బూక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100, కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు రమాదేవి, సునీత పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సిర్పూరు నియోజకవర్గంలోని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు హామీ ఇచ్చారు. సోమవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డైరీతో పాటు క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఇటీవల కాలంలో రిటైర్ అయిన ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని తెలుపగా, దీనిని శాసనసభలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎం జయదేవ్ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, సంఘం నాయకులు పైడి అంకయ్య, బీ నర్సయ్య, షేక్ మహబూబ్, ఎఎస్ఆర్ మూర్తి, కె నర్సయ్య, డి ఇస్తారు పాల్గొన్నారు.

జంగుబాయి మాల స్వీకరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జైనూర్ మండలంలోని జాంగం గ్రామంలోని దేవాలయంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి జంగుబాయి మాల స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుష్య మాసంలో వచ్చే అతి పవిత్రమైన దీక్ష జంగో లింగో దీక్ష అని అన్నారు. ఈ దీక్ష మనుషుల నడత, నడకలో మార్పులు తీసుకువస్తుందని తెలిపారు. చెడు మార్గంలో నడవకుండా అందరూ దైవ మార్గంలో నడవాలని సూచించారు, జంగో లింగో దేవతల ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేడు డివిజనల్ విద్యుత్ అదాలత్ కార్యక్రమం

నవతెలంగాణ-తిర్యాణి

ఆసిఫాబాద్ డివిజన్‌తో పాటు మండలంలోని విద్యుత్ వినియోగదారులకు ఏవైనా సమస్యల పరిష్కారం కోసం నేడు మండలకేంద్రంలో సబ్ స్టేషన్‌లో విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ సత్యనారాయణ, సభ్యులు రామకృష్ణ, కిషన్, రాజ గౌడ్ వస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని కెరమెరి, జైనూర్, సిర్పూర్ యూ, లింగాపూర్ మండలాల విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

రేపు బాలరాముని వార్షికోత్సవ శోభాయాత్ర

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయోధ్యలో బాలా రాముని విగ్రహ ప్రతిష్టాపన జరిగి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా రేపు పట్టణంలో కోదండ రామాలయం నుండి ఉదయం 9 గంటలకు బాల రాముని ప్రతిమతో శోభాయాత్ర నిర్వహించడం జరుగుతుందని శ్రీరామ హిందూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఇరుకుల్ల ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వ్యాపార సంఘాలు సహకరించాలని, మధ్యాహ్నం శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు.

ఉద్యమకారుని మృతికి సంతాపం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ సిటిజన్ కోట రాజారాం మృతి పట్ల 1969 తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంతాపం తెలిపింది. కాగజ్‌నగర్ మండలం చింతగూడలో అనారోగ్యంతో కోట రాజారాం మృతి చెందగా నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల పోరం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్ అబ్రహం, శివప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగులు బావండ్లపల్లి నర్సయ్య, నారాయణ, రమణయ్య, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, లక్ష్మినారాయణ, వాహబ్ పాల్గొన్నారు.

కవి వెంకట్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, ఉపాధ్యాయులు వెంకట్ హైదరాబాద్‌లో నిర్వహించిన కళా సంగమం, సంగీత సాహిత్య సాంస్కృతిక ఉత్సవంలో పాల్గొని రైతు కృషిపై వృత్త పద్యాలను గానం చేశారు. ఇందుకు గాను ఆయనకు రాష్ట్ర సంగీత సాంస్కృతిక కళా సాహిత్య అభినందన పత్రాన్ని అందించి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాకు చెందిన పలువురు కవులు కళాకారులు ఆయనను అభినందించారు.

నేటి నుంచి గ్రామసభలు

నవతెలంగాణ-నిర్మల్

నూతన ప్రభుత్వ పథకాల అమలుకై నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, నూతన ఆహార భద్రత కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం రేపటి నుంచి ఈనెల 24 వరకు గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా గ్రామ సభల నిర్వహణకు ప్రత్యేకాధికారులను నియమించి, అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సభలలో వివిధ పథకాలకు దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని వివరించారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందిచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డీఈఓ ఉత్తర్వులను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పని సర్దుబాటు కోసం కలెక్టర్ ఆదేశాలతో ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌కు సంబంధించి అలవెన్స్‌ల రద్దుపై జిల్లా విద్యాధికారి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, సునీల్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ఏ ఒక్క ఉపాధ్యాయుడు కూడా డిప్యూటేషన్ అడగలేదని పాఠశాల అవసరాలను బట్టి ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలకు ఉన్నతాధికారులు డిప్యూటేషన్ వేశారని, అయితే దానికి విరుద్ధంగా ప్రస్తుతం ఏజెన్సీ అలవెన్సులు రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. ప్రత్యేక అలవెన్సులు తొలగిస్తే డిప్యూటేషన్లు కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖ ఆర్టిజన్ల రిలే నిరాహార దీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఆర్టిజన్లు తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల జిల్లా అధ్యక్షుడు ఆత్రం మారుతి, నిరసనకు మద్దతు తెలిపిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేశామని అసెంబ్లీ సాక్షిగా చెప్పారన్నారు. కానీ పూర్తిస్థాయి రెగ్యులర్ చేయకుండా ఒకే సంస్థలో రెండు సర్వీస్ రూల్స్ పెట్టి ఆర్టిజన్ అని నామకరణం చేసి కొత్తగా స్టాండింగ్ ఆర్డర్స్ ప్రవేశపెట్టి కార్మికులను మోసం చేశారన్నారు. కార్మికులు నాలుగు నెలలుగా తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీగా ఏర్పడి కొత్తగా వచ్చిన ప్రభుత్వంతో కార్మికులందరిని పూర్తిస్థాయిలో రెగ్యులర్ చేయాలని, విద్యుత్ సంస్థలోని రెగ్యులర్ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తున్నాయో తమకు కూడా అలాగే కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని, ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కోరారు. తమ ఆవేదన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఐదు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఐదు రోజుల్లో ప్రభుత్వం నుండి తమకు అనుకూలంగా నిర్ణయం వస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రాయుడు, సీఐటీయూ జిల్లా కమిటీ వెలిశాల క్రిష్ణమాచారి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకానంద్, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు జిల్లా కన్వీనర్ నసీరుద్దీన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బుచ్చిబాబు, జిల్లా కోశాధికారి ఏకాంబర, జిల్లా వైస్ ప్రెసిడెంట్ వామన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, ఆర్టిజన్ కార్మికులు ప్రేమ్ సాగర్, సత్యం, శంకర్, కమలాకర్, బర్కత్, అశోక్, రామయ్య, శ్రీనివాస్, చంద్రయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో మార్గదర్శకులుగా ఉంటారని, విద్యాభివృద్ధిలో కృషి చేసే ఉపాధ్యాయులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : తుక్కుగూడ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హేమంత్ షిండే డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోకి వచ్చి ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేయడం దారుణమన్నారు. వెంటనే నిందితున్ని అదుపులోకి తీసుకొని శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాములుపై దాడి చేసిన దుండగులను శిక్షించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్ అన్నారు. సంఘటనను ప్రేరేపించిన దోషుల మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, కేఆర్‌కే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ పీజీహెచ్ఎం రాములుపైన దాడి చేసిన అల్లరిమూకల మీద, అందుకు ప్రేరేపించిన వ్యక్తుల మీద కేసులు నమోదు చేసి దోషులను శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులపైన ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. యావత్తు సమాజం ఈ సంఘటనను ఖండించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను అరెస్ట్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





వేతనాల కోసం మున్సిపల్ కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్ల రాజు, శ్రీకాంత్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ గ్రామపంచాయతీ మున్సిపల్‌గా ఏర్పడి దాదాపు 11 నెలలవుతున్న కార్మికులకు మున్సిపాలిటీ వేతనాలు చెల్లించడం లేదన్నారు. జీఓ నెంబర్ 60 ప్రకారంగా వేతనాలు చెల్లించాలని పది నెలల నుండి ఆందోళన చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే విషయంపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు కలెక్టర్‌కు కూడా వినతిపత్రాలు అందజేసినట్లు గుర్తు చేశారు. అయిన పరిస్థితులు మార్పు రాక విసిగిపోయి ముట్టడి కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ముట్టడి సందర్భంగా అక్కడికి వచ్చిన మున్సిపల్ కమిషనర్ భుజంగరావు కార్మికులతో మాట్లాడి మున్సిపాలిటీలో పనిచేస్తున్న 144 మంది కార్మికులకు నెల రోజుల్లో జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తానని తెలుపడంతో ధర్నా విరమించారు. ఒకవేళ హామీ నెరవేరకపోతే మళ్లీ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టికనంద్, దుర్గ ప్రసాద్, ప్రభాకర్, లక్ష్మి, సంధ్య, పెంటుబాయ్, పద్మ, బాలేష్, ప్రభాకర్, జగదీష్, నరేష్, దుర్గయ్య, శంకర్ పాల్గొన్నారు.

కోడి గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు కోడి గుడ్లు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని, పెరుగుతున్న ధరల కారణంగా గుడ్లు పెట్టలేని స్థితి ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు అన్నారు. ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎంఈఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. 23 ఏండ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యార్థులకు కోడి గుడ్డు పెట్టాలని ఇటు అధికారులు, అటూ ప్రభుత్వం ఒత్తిడి పెంచుతున్నారన్నారు. కానీ పెరుగుతున్న ధరల కారణంగా గుడ్డు బహిరంగ మార్కెట్‌లో రూ.8 పలుకుతుందని, ప్రభుత్వం మాత్రం రూ.5 మాత్రమే ఇవ్వడంతో కార్మికులపై భారం పడుతుందన్నారు. గుడ్డుతో పాటు సరకులను ప్రభుత్వం సరఫరా చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రాంబాయి, సుజాత, శ్రీదేవి, సత్యమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

నార్నూర్ : మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం మండల కేంద్రంలో ఎంఈఓ అనితకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు వంట సరుకులు, కోడిగుడ్లు, నిత్యావసర సరుకులు ప్రభుత్వాలే సరఫరా చేయాలన్నారు.కార్మికులు బయట అప్పులు చేసి పిల్లలకు భోజనం వండి పెడుతున్నారని, కోడిగుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెనూ చార్జీలు ఒక్క విద్యార్థికి రూ.25 చెల్లించాలని వంట కార్మికులను తొలగించకుండా జీఓ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస గౌరవ వేతనం రూ.పదివేలు పెంచుతామని హామీ ఇచ్చారని వెంటనే అమలు చేయాలన్నారు. ఇందులో సంఘం మండల కార్యదర్శి ఝడే నాందేవ్, కార్మికులు ఝాడే తాయి, సక్రవంతి, సలిమా, కవిత, శివబాయి, సులోచనబాయి ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఎక్స్‌రోడ్ లింగోజి తండా గ్రామానికి చెందిన రాథోడ్ గోకుల్ ఆదివారం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబ సభ్యులను ఆదుకుంటామని భరోసానిచ్చారు. అంతకముందు గోకుల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సునీల్ జాదవ్, అజయ్, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనసూయ దంపతులు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతి గల కారణాలను తెలుసుకొని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వెంట మాజీ జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, నల్ల వెంకటరామ్‌రెడ్డి, మాజీ అడెల్లి ఆలయ చైర్మెన్ ఐయిటి చందు, బన్సపెల్లి పీఏసీఎస్ చైర్మెన్ రమణారెడ్డి, ఆలూరు పీఏసీఎస్ వైస్ చైర్మెన్ లక్ష్మీనారాయణ, నాయకులు భూమేష్, సాయి కృష్ణ, చట్ల కాశీనాథ్, చందు, కిషన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ హమ్మద్ ముక్తేర్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు షేక్ షఫీలు ఉన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ బహుమతులు పంపిణీ చేశారు. గ్రామ యువకులు ఉల్లి సమ్మయ్య, మేడిపల్లి కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో ఫైనల్ రేసులో రాస్పెల్లి టీంతో ఎస్‌వి టీం తలపడింది. ఇందులో ఎస్‌వి టీం విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూడూరి జగదీష్, కుందారపు సుమన్, పోతుగంటి పెంటయ్య, వలపదాసు రమేష్, బొమ్మెల రాజయ్య పాల్గొన్నారు.

కుట్టు మిషన్ కేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ సమీపంలో యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కుట్టు మిషన్ కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ మాసం అనిల్ కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యశోద ఫౌండేషన్ డైరెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు చాలా కుట్టుమిషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, పేదలకు తక్కువ ధరతో దుస్తులు కుట్టించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బత్తుల రమేష్, రైతు నాయకుడు నారాయణ, డాక్టర్ గౌస్, మహిళలు పాల్గొన్నారు.

బండోరా కార్యక్రమంలో పాల్గొన్న ఆడే గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొరటికల్ గ్రామంలో నిర్వహిస్తున్న బండారో కార్యక్రమంలో సోమవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొని ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనతో పాటు బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, నాయకులు కరాడ్ బ్రహ్మానంద్, జలంధర్, అజీమ్, షబ్బీర్, శంకర్, పాల శంకర్, కుంట శంకర్, కపిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కదిలి ఆలయంలో వేలం పాట

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

దిలావర్‌పూర్ మండలంలోని కదిలి శ్రీమాత అన్నపూర్ణ సహిత పాపహరేశ్వర ఆలయంలో కొబ్బరికాయలు, కిరాణం సామాను అమ్ముకోవడానికి మంగళవారం ఉదయం 10:30 గంటలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ భూమయ్య తెలిపారు. ఆసక్తి కలవారు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి, వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వేలంపాట కాల పరిమితి ఒక సంవత్సరం వరకు ఉంటుందన్నారు.